

8 లో

ఎడ్ల బండి... సై సై అంటూ కదిలింది

ఎడ్ల బండి సై సై అంటూ సాగింది.. పోటీకి కాలు దువ్వింది.. దీనికి రాయవరం మండలం మాచవరం వేదికైంది.



భజే నారసింహాయ..

నమో నారసింహాయ అని ఆ స్వామిని కొలుస్తూ భక్తులు తన్మయత్వం చెందారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం విశేష పూజలు జరిగాయి.

అన్న కోసం ఆస్తి దానం



తనకు శాశ్వతంగా దూరమైన అన్నయ్యపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నాడా తమ్ముడు. అన్న జ్ఞాపకార్థం ఉమ్మడిగా నిర్మించుకున్న రూ. 25 లక్షల విలువైన స్థిరాస్తిని ఆలయానికి అందజేశాడు. 8లో..

న్యూస్‌రీల్

నేడు జగనన్న చేదోడు

- జిల్లావ్యాప్తంగా 13,491 మందికి రూ.13.49 కోట్ల లబ్ధి
- లబ్ధిదారుల ఖాతాల్లో రూ.10 వేల చొప్పున జమ
- కలెక్టర్ మాధవీలత వెల్లడి



కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జగనన్న చేదోడు పథకం మూడో విడత సహాయాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం సోమవారం జమ చేయనున్నదని కలెక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి పల్నాడు జిల్లా వినుకొండలో జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ఆర్థిక సహాయం జమ చేస్తారని వివరించారు. జిల్లా స్థాయి కార్యక్రమం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు జరుగుతుందన్నారు. ఈ పథకం కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 13,491 మంది దర్జీలు, రజకులు, నాయీ బ్రాహ్మణులు తదితర లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.10 వేల చొప్పున మొత్తం రూ.13.49 కోట్ల మేర సహాయం అందిస్తుందని తెలిపారు. జగనన్న చేదోడు పథకం కింద గత రెండు విడతల్లో జిల్లాలోని 12,181 మంది లబ్ధిదారులకు రూ.22.12 కోట్లు అందజేసిందని కలెక్టర్ పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి బొక్కా వెంకన్నబాబు, లోహిత (ఆత్రేయపురం మండలం నార్కెడ్‌మిల్లి) ఆదివారం రూ.1,01,116, డి.సత్యనారాయణ, నాగ సుబ్బలక్ష్మి (కొత్తపేట మండలం వానపల్లి) రూ.25 వేల చొప్పున విరాళం సమర్పించారు. దాతలకు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, సిబ్బంది చేతుల మీదుగా స్వామి వారి చిత్రపటాలు అందజేశారు.

కోటసత్తెమ్మకు రూ.1.50 లక్షల ఆదాయం

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, ప్రత్యేక పూజలు చేసినట్టు ఈఓ బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు. ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టికెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా రూ.1,50,485 ఆదాయం వచ్చిందని ఈఓ వివరించారు. భక్తుల ఏర్పాట్లను ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రామసుబ్బరాయశాస్త్రి, ధర్మకర్తల మండలి సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

లోవకు పోటెత్తిన భక్తజనం



లోవ ఆలయ ప్రాంగణంలో చెట్ల కింద వంటలు, భోజనాలు చేస్తున్న భక్తులు

తుని రూరల్: పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆదివారం లోవ దేవస్థానంలో రద్దీ నెలకొంది. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ భక్తులు ప్రత్యేక వాహనాల్లో వస్తూనే ఉన్నారు. లోవలో ప్రధానాలయ పునర్నిర్మాణం, మహామంటప నిర్మాణ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నెల 28 నుంచి భక్తుల దర్శనార్థం మెట్లమార్గంలో పెద్ద అమ్మవారి విగ్రహం వద్ద బాలాలయం నిర్మించి, తలుపులమ్మ అమ్మవారిని ప్రతిష్ఠించారు. బాలాలయంలో అమ్మవారిని ఆరు వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాలు, కేశఖండన శాల, పూజా టికెట్లు, వాహన పూజలు, వసతి గదులు, కాటేజీలు, పొంగలి షెడ్ల అద్దెల ద్వారా రూ.2,54,624 ఆదాయం వచ్చిందని వివరించారు. బాలాలయం వద్ద క్యూలో వేచి ఉన్న భక్తుల సౌకర్యార్థం షామియానాలు ఏర్పాటు చేశారు. భారీగా భక్తులు తరలిరావడంతో దేవస్థానం అధీనంలోని వసతి గదులు, కాటేజీలు, పొంగలి షెడ్లు నిండుకున్నాయి. వేలాదిగా భక్తులు దేవస్థానం ప్రాంగణంలోని చెట్ల కింద, ఘాట్ రోడ్డు దిగువన ప్రైవేటు పాకలు, వసతి గదులు, తోటల్లో వసతి ఏర్పాటు చేసుకుని వంటలు, భోజనాలు చేశారు.

తూర్పున పారిశ్రామిక నవోదయం




- జిల్లాలో పెరుగుతున్న పరిశ్రమలు
- ఔత్సాహికులకు ప్రభుత్వం ప్రోత్సాహం
- రెండు భారీ పరిశ్రమలకు కేంద్రంగా జిల్లా
- ఎంఎస్ఎంఈల పరిధిలో ఉపాధి అవకాశాలు
- బలభద్రపురంలో రూ.2,500 కోట్లతో గ్రాసిమ్ కాస్టిక్ సోడా పరిశ్రమ
- గుమ్మళ్లదొడ్డి వద్ద రూ.260 కోట్లతో ఇథనాల్ ప్రాజెక్టుకు శంకుస్థాపన



గుమ్మళ్లదొడ్డి వద్ద ఇథనాల్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

సాక్షి, రాజమహేంద్రవరం: జిల్లా సుస్థిర ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. ఈ క్రమంలోనే పరిశ్రమల స్థాపనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందుకు అనుగుణంగా పారిశ్రామికవేత్తలకు అన్ని రకాల అనుమతులూ సింగిల్‌విండో విధానంలో ఇస్తున్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రాయితీపై భూములు కేటాయిస్తుండటం, పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉండటంతో పారిశ్రామిక దిగ్గజాలు, బహుళజాతి సంస్థలు జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు క్యూ కడుతున్నాయి. వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెడుతున్నాయి. వీటితో పాటు సూక్ష్మ-చిన్న-మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలకు అత్యధిక శాతం మంది ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు జిల్లా కేంద్రంగా మారింది. పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలన్న ప్రభుత్వ అజెండాతో వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి దక్కుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో జిల్లాకు వచ్చిన పరిశ్రమలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.



జిల్లాలో ఏడాది వ్యవధిలో ఏర్పాటైన ఎంఎస్ఎంఈలు, పెట్టుబడులు వివరాలు ఇలా..

నెల	యూనిట్లు	పెట్టుబడులు (రూ.లక్షల్లో)	ఉపాధి పొందిన వారు
2022 ఏప్రిల్	45	578	192
మే	55	939	373
జూన్	161	1,863	654
జూలై	579	6,423	2,422
ఆగస్టు	189	4,587	863
సెప్టెంబర్	197	2,901	926
అక్టోబర్	215	5,397.5	1,145
నవంబర్	282	4,605.5	1,115
డిసెంబర్	291	3,708	1,217
2023 జనవరి	413	7,555	1,272

ఎంఎస్ఎంఈలతో 10,179 మందికి ఉపాధి

ప్రభుత్వం గడచిన మూడున్నరేళ్లుగా ఎంఎస్ఎంఈలతో ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా 6 వేల ఎంఎస్ఎంఈలు స్థాపించాలన్నది లక్ష్యం కాగా ఇప్పటికే 2,427 ఎంఎస్ఎంఈలు ఏర్పాటయ్యాయి. రూ.39,557 లక్షల మేర పెట్టుబడులు వచ్చాయి. ఫలితంగా 10,179 మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. మిగిలిన వాటిని సైతం త్వరితగతిన గ్రౌండింగ్ చేసేందుకు అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోంది.

రూ.2,500 కోట్లతో గ్రాసిమ్ ఇండస్ట్రీ

కొత్త జిల్లాల ఏర్పాటు అనంతరం బలభద్రపురంలో భారీ పరిశ్రమ స్థాపనకు అడుగులు పడ్డాయి. పారిశ్రామిక దిగ్గజ కంపెనీ ఆదిత్య బిర్లా గ్రూప్ తొలి దశలో రూ.1,000 కోట్లు.. రెండో దశలో మరో రూ.1,500 కోట్ల పెట్టుబడితో గ్రాసిమ్ కాస్టిక్ సోడా ప్లాంట్ నిర్మాణానికి నాంది పలికింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిరాదరణకు గురైన ఈ ప్రాజెక్టును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టాలెక్కించారు. సంస్థ యాజమాన్యంతో చర్చలు జరిపి, పరిశ్రమ స్థాపనకు ఒప్పించారు. పరిశ్రమకు ఆయనే స్వయంగా శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం దీని నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. పరిశ్రమ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే 2,500 మందికి ఉపాధి లభిస్తుంది.

ఇథనాల్ ప్రాజెక్టుకు శ్రీకారం

'రైస్ బౌల్ ఆఫ్ ఇండియా'గా పేరొందిన గోదావరి తీరంలో పెట్రో ఉత్పత్తుల్లో కలిపే బియ్యం ఆధారిత తొలి ఇథనాల్ ప్లాంట్ నెలకొల్పే దిశగా అడుగులు పడ్డాయి. గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి వద్ద రూ.260 కోట్ల అంచనాతో ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఇప్పటికే శంకుస్థాపన చేశారు. ఈ పరిశ్రమకు ఏపీఐఐసీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.13.50 కోట్ల విలువైన 20.07 ఎకరాల భూమి కేటాయించింది. ఈ పరిశ్రమలో రోజుకు 200 కిలోలీటర్ల (2 లక్షల లీటర్ల) ఇథనాల్ ఉత్పత్తి జరగనుంది. ప్లాంట్ నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే 210 మందికి పైగా నిరుద్యోగులు, కూలీలకు ఉపాధి లభించనుంది.

మరో రెండో భారీ పరిశ్రమలు

- కొవ్వూరు మండలం ఇసుకపట్ల పంగిడి గ్రామం వద్ద మరో భారీ పరిశ్రమకు నాంది పలకనున్నారు. 26.65 ఎకరాల విస్తీర్ణంలో రూ.1,350 కోట్ల పెట్టుబడితో త్రివేణి రెన్యువబుల్స్ సంస్థ ఆధ్వర్యాన సోలార్ గ్లాస్ తయారీ పరిశ్రమకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ పరిశ్రమ అందుబాటులోకి వస్తే 2,400 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి.
- నల్లజర్ల మండలం పోతవరం గ్రామంలో 14 ఎకరాల్లో జాగృతి బయోటెక్ ప్రైవేటు సంస్థ ఆధ్వర్యాన బయోటెక్నాలజీ కంపెనీ అందుబాటులోకి రానుంది. రూ.50 కోట్ల పెట్టుబడులతో నిర్మిస్తున్న ఈ సంస్థ పూర్తి స్థాయిలో రూపుదిద్దుకుంటే 81 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.
- అక్రమంగా మద్యం తయారు చేస్తున్న వారిని ఆ పని మాన్పించి, స్వయం ఉపాధి కల్పించేందుకు వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం పథకంలో భాగంగా ఏపీ ఖాదీ – గ్రామీణ పరిశ్రమల బోర్డు ద్వారా 24 స్వయం ఉపాధి యూనిట్లు, పరిశ్రమల శాఖ ద్వారా మరో 5 యూనిట్ల స్థాపనకు అన్ని ఏర్పాట్లూ చేశారు. రూ.1.35 కోట్ల రుణాలు అందిస్తున్నారు. చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందేలా ప్రోత్సహిస్తున్నారు. వీరికి 35 శాతం సబ్సిడీ అందజేస్తున్నారు.

స్థానికులకు ఉపాధి



జిల్లాలో పారిశ్రామిక రంగం వేగంగా విస్తరిస్తోంది. గత ఏడాదిలో నెలల వ్యవధిలోనే రెండు భారీ పరిశ్రమలకు శంకుస్థాపన జరిగింది. మరో రెండు పరిశ్రమలు రాబోతున్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేయడంతో పారిశ్రామికవేత్తలు ఉత్సాహం చూపుతున్నారు. పరిశ్రమలు పూర్తి స్థాయిలో ఏర్పాటైతే స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా దక్కుతాయి.

– కె.వెంకటేశ్వరరావు, జిల్లా పరిశ్రమల అధికారి

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కాకినాడ రూరల్: కొవ్వాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఇంద్రపాలెం పోలీసుల కథనం ప్రకారం.. పెదపూడికి చెందిన మేడిశెట్టి సత్య రమేష్ (20) ఎల్‌జీ కంపెనీలో టెక్నీషియన్ వద్ద హెల్పర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం కాకినాడ నుంచి మోటార్ సైకిల్‌పై పెదపూడి వెళ్తున్నాడు. కొవ్వాడ వద్ద ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేస్తుండగా వెనుక ట్రక్కు బైక్‌కు తగిలింది. దీంతో అదుపు తప్పి కింద పడిపోయిన రమేష్ పైకి ట్రక్కు వెనుక చక్రాలు ఎక్కేయడంతో తీవ్రంగా గాయపడి, రక్తస్రావంతో మృతి చెందాడు. మృతుడి తండ్రి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నాగరాజు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



తంటికొండలో గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న భక్తులు

గోకవరం: తంటికొండ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన ఆదివారం గిరి ప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు (రెడ్డి), ఈఓ ఆర్‌వీ చందనల ఆధ్వర్యాన స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి, అర్చకుల సమక్షంలో ఈ కార్యక్రమం చేపట్టారు. డప్పు వాయిద్యాలు, కోలాటం నడుమ కోలాహలంగా గిరి ప్రదక్షిణ జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు గోవింద నామస్మరణలతో పాల్గొన్నారు. అంతకు ముందు గిరి ప్రదక్షిణ రోడ్డును వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో దేశాబత్తుల సత్యనారాయణమూర్తి (సిద్ధాంతి), వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, దేవస్థానం మాజీ చైర్మన్ పెద్దాడ వెంకన్నదొర, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజున శ్రీలక్ష్మీ నారసింహ సహిత సుదర్శన హోమంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కిక్కిరిసిన అయినవిల్లి



అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ప్రధానార్చకుడు వినాయకరావు ఆధ్వర్యాన స్వామివారికి విశేష పూజలు చేశారు. స్వామివారి లఘు న్యాస అభిషేకాలు, లక్ష్మీ గణపతి హోమంలో భక్త దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నూతన వాహనాలకు పూజలు చేయించుకున్నారు. స్వామివారి ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.6 వేలు, అన్న ప్రసాదాల విరాళాలుగా రూ.67 వేలు, వివిధ సేవల రూపంలో రూ.13 వేలు, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.20 వేలు, వివిధ విరాళాలుగా రూ.8 వేలు కలిపి మొత్తం రూ.1.14 లక్షల ఆదాయం లభించిందని ఈఓ సత్యనారాయణరాజు తెలిపారు.

గుడ్డుకాయస్వాహాకు చెక్

- కోడిగుడ్లపై స్టాంపింగ్‌తో అవకతవకలకు తెర
- అంగన్‌వాడీల్లో అక్రమాలకు అడ్డుకట్ట
- సజావుగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ



వైఎస్సార్ సంపూర్ణ పోషణ స్టాంప్ వేసిన గుడ్లు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అవినీతిపరులు గుడ్లు తేలేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కోడిగుడ్ల పంపిణీ ఒకప్పుడు అవకతవకలకు కేంద్ర బిందువుగా ఉండేది. హాజరు శాతం పెంచి చూపించి కొన్నిచోట్ల గుడ్లు నొక్కేసేవారు. మధ్యలోనే దారి మళ్లించి మార్కెట్‌లో అమ్మేసేవారు. పెద్ద సైజు గుడ్లను మార్కెట్‌లో అమ్మేసి చిన్న సైజు గుడ్లను సెంటర్లలో పంపిణీ చేసేవారు. పంపిణీలో అవకతవకల వల్ల నాణ్యతా లోపంతో గుడ్లు చెడిపోతుండేవి. గర్భిణులు, బాలింతలు, ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు, 3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలకు ప్రతి నెలా సుమారు 25 గుడ్లను వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తోంది. 6 నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు ప్రతి 15 రోజులకు ఒకసారి ఇంటికి గుడ్లను అందిస్తారు. మిగిలిన వారందరికీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉడకబెట్టి పంపిణీ చేస్తారు. ఈ గుడ్లలో నాలుగు నుంచి ఆరు శాతం దారి మళ్లించడమో పాడైపోవడమో జరుగుతూండేది. దీనిని నివారించేందుకు ప్రభుత్వం నెలను మూడు భాగాలుగా విభజించింది. మొదటి 10 రోజులూ సరఫరా చేసే గుడ్లపై ఒక రంగు, తరువాతి 10 రోజులకు మరో రంగు, మిగిలిన 10 రోజులకు వేరే రంగు చుక్కలు పెట్టి పంపిణీ చేసేది. అయితే అక్రమార్కులు ఐదూ పది నిమిషాల పాటు ఈ కోడిగుడ్లను నీళ్లలో నానబెట్టి గుడ్డుపై ముద్రించిన గుర్తులను తుడిచేసి చెరిపేసేవారు. తరువాత ఆ గుడ్లను హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలువచ్చాయి. అవకతవకల నివారణకు తీసుకున్న ఈ చర్యల వల్ల కూడా అంతగా ఆశించిన స్థాయిలో ప్రయోజనం కనిపించలేదు.

ఉమ్మడి 'తూర్పు'న అంగన్‌వాడీ వివరాలు

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	:	28
అంగన్‌వాడీ కేంద్రాలు	:	5,446
మెయిన్ కేంద్రాలు	:	5,113
మినీ కేంద్రాలు	:	433
గర్భిణులు	:	35,215
బాలింతలు	:	34,564
6 నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలు	:	1,47,790
3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలు	:	76,623

మూడు రంగుల ముద్ర

అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, లబ్ధిదారులు గుడ్లను దుర్వినియోగం చేయకుండా నివారించేందుకు ప్రభుత్వం సరికొత్తగా కలర్ కోడింగ్ విధానం అమలుకు శ్రీకారం చుట్టింది. బ్లూ, పింక్, గ్రీన్ (బీపీజీ) రంగుల్లో గుడ్ల సరఫరా ఆరంభించింది. నెలలో మొదటి 10 రోజులు బ్లూ కలర్ కోడింగ్, తరువాతి 10 రోజులు పింక్, మిగిలిన 10 రోజులూ ఆకుపచ్చ రంగు కోడింగ్‌తో గుడ్లు అందించేవారు. కలర్ కోడింగ్ వలన అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన గుడ్లను బయట అమ్మే వీలుండేది కాదు. ఒకవేళ బయట అమ్మినా అవి అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసినవని గుర్తించే వీలుంది. ఫలితంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషకాహారం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరేది. అయితే, ఇంత చేస్తున్నా గుడ్లను దొడ్డిదారిన అమ్మేయడానికి మాత్రం అడ్డుకట్ట పడలేదు.

స్టాంపింగ్‌తో సత్ఫలితాలు

ఈ పరిస్థితులను పూర్తిగా చక్కదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ గుర్తు చెరిగిపోని విధంగా కోడిగుడ్లపై స్టాంప్ వేసే విధానాన్ని తీసుకువచ్చింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అమలు చేస్తున్న ఈ విధానం క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలు ఇస్తోందని అధికార యంత్రాంగాలు గుర్తించాయి. తాజాగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేరుతో చెరిపేసినా చెరగని ఒక స్టాంప్‌ను గుడ్డుపై వేస్తోంది. ఈ గుర్తు కారణంగా మార్కెట్‌లో అంగన్‌వాడీ గుడ్లను దొడ్డిదారిన అమ్ముకొనే అవకాశం ఉండటం లేదు. నిర్దేశించిన గుర్తు ముద్రించిన తరువాతే వీటిని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేస్తున్నారు. ఈ మార్పు సత్ఫలితాలను ఇస్తోందని చెబుతున్నారు.

అక్రమాలకు ఆస్కారం ఉండదు



అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి లబ్ధిదారుకూ గుడ్డు అందించాలని ఆదేశించాం. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతో రక్తహీనత నుంచి రక్షణ లభిస్తుంది. పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల్లో కోడిగుడ్డుకు ప్రత్యేక స్థానం ఉంది. చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు ఉడికించిన కోడిగుడ్డు ఇస్తున్నాం. నిల్వ గుడ్లకు ఆస్కారం లేకుండా ప్రతి 10 రోజులకు ఒక రంగుతో కూడిన గుడ్లను సరఫరా చేస్తున్నాం. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ముద్రతో గుడ్లు సరఫరా చేయడం వల్ల అక్రమాలకు అవకాశం లేదు.

– కొండా ప్రవీణ, కాకినాడ జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి

నిల్వ గుడ్లు గుర్తించే అవకాశం



అంగన్‌వాడీ కేంద్రాలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద అందించే గుడ్లకు మూడు రంగుల్లో కలర్ కోడింగ్ ఇవ్వడం శుభపరిణామం. తద్వారా గుడ్లు దుర్వినియోగం కావు. నిల్వ గుడ్లు అయితే కలర్‌ను బట్టి గుర్తించే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులకు, లబ్ధిదారులకు జవాబుదారీగా ఉంటుంది.

– డి.రత్నం, అంగన్‌వాడీ టీచర్, పెనుమర్తి

నిడదవోలు రైల్వే గేటు నేటి నుంచి మూసివేత

- ఫిబ్రవరి 8న పునఃప్రారంభం
- ట్రాక్‌కు అత్యవసర మరమ్మతులు



నిడదవోలు రైల్వేగేటు

నిడదవోలు: పట్టణంలోని నెహ్రూ బొమ్మ సెంటర్‌లో ఉన్న ప్రధాన రైల్వే గేటును సోమవారం ఉదయం 7 గంటల నుంచి పది రోజుల పాటు మూసివేస్తున్నారు. ట్రాక్ మరమ్మతుల నిమిత్తం ఈ నిర్ణయం తీసుకున్నామని తాడేపల్లిగూడెం రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ అల్లూరి రవి ఆదివారం తెలిపారు. దీనిపై పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, ఆర్టీసీ ఉన్నతాధికారులకు రైల్వే ఉన్నతాధికారులు ఇప్పటికే నోటీసులు అందజేశారు. భద్రతా చర్యల్లో భాగంగా రెండేళ్లకోసారి రైల్వే గేటు వద్ద ఉన్న రెండు ట్రాక్‌లకూ మరమ్మతులు చేపడతారు. పనులు పూర్తయిన అనంతరం తిరిగి ఫిబ్రవరి 8వ తేదీన ఈ రైల్వే గేటు తెరవనున్నారు.

ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు

రైల్వే గేటు మూసివేత నేపథ్యంలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఏపీఎస్ ఆర్టీసీ నిడదవోలు డిపో మేనేజర్ కె.శ్రీరామ్‌కుమార్ తెలిపారు. తాడేపల్లిగూడెం నుంచి ఏడు బస్సు సర్వీసులను ప్రతి రోజూ నిడదవోలు రైల్వే గేటు వరకూ నడుపుతారు. అలాగే నిడదవోలు రైల్వే గేటు నుంచి రాజమహేంద్రవరం వెళ్లేందుకు నిడదవోలు ఆర్టీసీ డిపో నుంచి రోజూ ఐదు సర్వీసులు నడుపుతారు. నిడదవోలు ఆర్టీసీ డిపో నుంచి ఏలూరు, విజయవాడ ప్రాంతాలకు ఉండ్రాజవరం, తణుకు మీదుగా నాలుగు బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు.

సింగవరం మీదుగా..

రాజమహేంద్రవరం, కొవ్వూరు, పంగిడి, దేవరపల్లి నుంచి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ద్విచక్ర వాహనాలు తాడేపల్లిగూడెం చేరుకోవచ్చు. నిడదవోలు గణేష్‌చౌక్ సెంటర్ నుంచి గణపతి సెంటర్, సంత మార్కెట్, సుబ్బరాజుపేట, సింగవరం, తాళ్లపాలెం గ్రామాల మీదుగా తాడేపల్లిగూడెం చేరవచ్చు.

క్లుప్తంగా

రత్నగిరిపై నేడు 'డయల్ యువర్ ఈఓ'

అన్నవరం: స్థానిక వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సోమవారం డయల్ యువర్ ఈఓ కార్యక్రమం జరుగుతుందని అధికారులు ప్రకటించారు. ఉదయం 10.30 గంటల నుంచి 11.30 వరకు భక్తులు 08868 –238127కు ఫోన్ చేసి దేవస్థానం ఈఓ సత్య నారాయణమూర్తితో మాట్లాడవచ్చు. తమ విలువైన సలహాలు, సూచనలతో పాటు ఫిర్యాదులు తెలియజేయవచ్చని అధికారులు వివరించారు.

పరీక్షల విధుల నుంచి తొలగింపు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లోని జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న నర్సింగ్, హౌస్ సర్జన్ల సీటు గుమస్తా కొండేపూడి శేఖర్‌ను జీఎన్ఎం పరీక్షల విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. నర్సింగ్ కళాశాలల నుంచి లంచాలు తీసుకుని ఆయా విద్యార్థులు కాపీయింగ్ చేసేందుకు శేఖర్ పరోక్షంగా పావులు కదిపిన విషయం బట్టబయలై కలెక్టర్ కృతికా శుక్లా దృష్టికి చేరిన విషయం విదితమే. ఈ వ్యవహారంపై కలెక్టర్ జీజీహెచ్ సూపరింటెండెంట్‌తో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోగా, ఆమె ఆదేశాలను అనుసరించి ఉన్నతాధికారులు శేఖర్‌ను పరీక్షల విధుల నుంచి తప్పించారు.

ఇన్విజిలేటర్లుగా వైద్యులు

పరీక్షలలో ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తున్న స్టాఫ్, హెడ్ నర్సులు విద్యార్థులకు రాత పరీక్షల్లో సహకరించే అవకాశం ఉందన్న ఆరోపణలపై యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ ఆదేశాల మేరకు సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి 33 మంది నర్సుల స్థానంలో వైద్యులనే ఇన్విజిలేటర్లుగా నియమిస్తూ ఆదివారం నిర్ణయం తీసుకున్నారు. సోమవారం నుంచి మరో మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ పరీక్షలకు వైద్యులతో కలసి 31 మంది మినిస్టీరియల్ సిబ్బంది ఇన్విజిలేటర్లుగా వ్యవహరించనున్నారు. పరీక్షల నిర్వహణ కోసం రంగరాయ వైద్య కళాశాలలోని రెండు ఎగ్జామినేషన్ హాళ్లు, రెండు లెక్చర్ గ్యాలరీలు, సైకాలజీ, అనాటమీ తరగతి గదులు, వాటి ప్రాంగణాలు, డైనింగ్ హాలు, ఆడిటోరియంతో పాటు ప్రాంగణాన్ని వినియోగించనున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

తుని రూరల్: తుని పట్టణం సీతారాంపురంలో నివాసం ఉంటున్న హెటిరో ఉద్యోగి ఎన్.మహేష్ (24) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు హెడ్ కానిస్టేబుల్ జయంత్ తెలిపారు. ఆదివారం మృతుడి భార్య సింధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మహేష్ ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ వివరించారు.

సీబీఎస్‌ఈ... వస్తోందండోయ్..

- సర్కారు బడుల్లో కేంద్రీయ విద్యా విధానం
- ఉమ్మడి జిల్లాలో 60 పాఠశాలల ఎంపిక
- పేద విద్యార్థులకు మంచి రోజులు
- పోటీ పరీక్షల్లో సత్తా చాటే అవకాశం



అమలాపురం మండలం పేరూరులో సీబీఎస్‌ఈకి ఎంపికైన పాఠశాల

రాయవరం: వైద్య విద్య అభ్యసించాలంటే దేశ వ్యాప్తంగా జరిగే పోటీ పరీక్షలో నెగ్గుకు రావాలి. అలాగే ఐఐటీ, ఎన్ఐటీ వంటి ఇంజినీరింగ్ విద్యా సంస్థల్లో కోర్సులు చదవడానికీ పోటీ పరీక్షల్లో సత్తా చాటాలి. సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) విద్య అభ్యసిస్తే పోటీ పరీక్షల్లో సులువుగా విజయం సాధిస్తారనే భావన తల్లిదండ్రుల్లో ఉంది. అందుకే సీబీఎస్‌ఈ విధానానికే అంతా మొగ్గు చూపుతుంటారు. అటువంటి సిలబస్‌ను ఇప్పుడు ప్రభుత్వం పేద విద్యార్థులకూ అందుబాటులోకి తెస్తోంది. దీనిని సర్కారు బడుల్లో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మొదటి విడతలో పాఠశాలలను ఎంపిక చేసింది.

సెంట్రల్ బోర్డులో రిజిస్ట్రేషన్

ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలను మనబడి నాడు–నేడు పథకం ద్వారా కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా తీర్చిదిద్దింది. అంతేకాకుండా ఆంగ్ల విద్యకు శ్రీకారం చుట్టింది. నాణ్యమైన, గుణాత్మక విద్యను అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటుంది. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు కార్యాచరణ చేపట్టింది. విద్యార్థులు ప్రపంచ స్థాయి పోటీని ఎదుర్కొనేందుకు సీబీఎస్‌ఈ సిలబస్ విధానాన్ని అమలు చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్సరంలో 9వ తరగతి విద్యార్థులను సెంట్రల్ బోర్డులో రిజిస్ట్రేషన్ చేయించనుంది. సీబీఎస్‌ఈ విధానానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 60 పాఠశాలలను ఎంపిక చేశారు. తూర్పు గోదావరి జిల్లాలో 15, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 12, కాకినాడ జిల్లాలో 33 పాఠశాలలను ఎంపిక చేసినట్లు అధికారులు చెప్పారు.

114 మంది ఉపాధ్యాయులకు శిక్షణ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్‌ఈ బోధన జరగనుంది. ఈ మేరకు ఆయా పాఠశాలల్లో హెచ్‌ఎంలు, స్కూల్ ఫస్ట్ అసిస్టెంట్ లేదా ఒక ఉపాధ్యాయుడిని శిక్షణకు ఎంపిక చేశారు. మొదటి దశలో 114 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. గత నెల 28, 29 తేదీల్లో కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలకు రాజమహేంద్రవరం, కాకినాడ జిల్లాకు కాకినాడలో శిక్షణ ఇచ్చారు. ఇప్పటి వరకూ సిలబస్ ఆధారంగా ముద్రించిన పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. ఈ విధానంలో పరీక్షల్లో అడిగిన ప్రశ్నలకు నేరుగా జవాబులు రాస్తారు. బట్టీ విధానాన్ని అనుసరించకుండా సీబీఎస్‌ఈలో ప్రతి అంశం ప్రయోగాత్మకంగా ఉంటుంది. సహజంగా తాము నేర్చుకున్న దాన్ని బట్టి సమాధానాలు రాయారు. దేశ వ్యాప్తంగా జరిగే పోటీ పరీక్షలను ఆత్మస్థైర్యంతో రాసే విధంగా విద్యార్థులను సన్నద్ధం చేస్తారు.

2024–25లో మొదటి బ్యాచ్

కేంద్ర ప్రభుత్వం అధీనంలోని మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ సీబీఎస్‌ఈ. సెకండరీ స్థాయిలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి బోర్డు సర్టిఫికెట్‌ను అందజేస్తోంది. రాష్ట్రంలో 2024–25 విద్యా సంవత్సరంలో తొలి బ్యాచ్ పదో తరగతి వారికి పరీక్షలు నిర్వహించేందుకు ఇప్పటి నుంచి సమాయత్తం చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలోనే సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ పేరుతో సీబీఎస్‌ఈ విజయవాడలో రీజనల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది.

విప్లవాత్మక మార్పులకు నాంది



సీబీఎస్‌ఈ సిలబస్ విధానం విద్యార్థులకు ఒక వరం లాంటిది. తొలి దశలో అమలు చేసే పాఠశాలల్లో ఉపాధ్యాయులకు రెండు రోజుల ఓరియంటేషన్ శిక్షణ ఇచ్చాం. విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులకు సీబీఎస్‌ఈ నాంది పలుకుతుంది. – బీవీవీ సుబ్రహ్మణ్యం, పొటెన్షియల్ రిసోర్స్ పర్సన్, అమలాపురం

పోటీ పరీక్షల్లో రాణిస్తారు



సీబీఎస్‌ఈ సిలబస్ అమలుతో రాష్ట్ర విద్యా విధానంలో సమూల మార్పులు చోటు చేసుకుంటాయి. దేశ వ్యాప్తంగా జరిగే పోటీ పరీక్షల్లో విద్యార్థులు సత్తా చాటే అవకాశం ఉంటుంది. రాబోయే కాలంలో అన్ని తరగతులు సీబీఎస్‌ఈకి మారే అవకాశముంది. – ఎమ్వీ రవిసాగర్, డీఈవో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

సీబీఎస్‌ఈకి అనుగుణంగా సౌకర్యాలు



కొత్త విధానంలో ఇబ్బందులు ఎదురైనా సమర్థంగా ఎదుర్కొంటాం. అప్పుడే సత్ఫలితాలు వస్తాయి. విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సీబీఎస్‌ఈ సిలబస్ బోధనకు అనుగుణంగా పాఠశాలల్లో సౌకర్యాలను కల్పిస్తోంది. – ఎస్.అబ్రహం, డీఈవో, తూర్పుగోదావరి జిల్లా

వేట బోటు బోల్తా

- మత్స్యకారులు సురక్షితం

కాట్రేనికోన: వేటకు వెళ్లిన మత్స్యకారుల బోటు బోల్తా పడిన ఘటన మండలంలోని కందికుప్ప లైట్‌హౌస్ ప్రాంతంలో జరిగింది. బలుసుతిప్పలోని కొత్తపేటకు చెందిన కాలాడి ధర్మారావు ఇంజిన్ బోటులో అతనితో పాటు మరో నలుగురు వేట నిమిత్తం శుక్రవారం సముద్రంలోకి బయలుదేరారు. వాతావరణంలో మార్పులతో ఆదివారం సాయంత్రం తిరిగి వస్తున్న నేపథ్యంలో మొగ ప్రాంతంలో బలమైన గాలులకు బోటు బోల్తా పడింది. ఐదుగురు మత్స్యకారులూ నీట మునిగినప్పటికీ బోటుపైకి ఎక్కి ప్రాణాలను కాపాడుకున్నారు. సమీప ప్రాంతాల్లో ఉన్నవారి ద్వారా విషయం గ్రామస్తులకు తెలపగా వారు మూడు బోట్లలో వెళ్లి వారిని తీరానికి సురక్షితంగా చేర్చారు.

సత్యదేవుని సన్నిధిలో మంత్రి వేణుగోపాలకృష్ణ



సత్యదేవుని సన్నిధిలో వేద పండితుల ఆశీస్సులు పొందుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

అన్నవరం: అన్నవరం రత్నగిరిపై సత్యదేవునిని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆదివారం దర్శించుకుని పూజలు చేశారు. తొలుత ఆలయం వద్ద ఆయనకు పండితులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను ఆలయ ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు ఇచ్చారు. ఆయన వెంట దేవస్థానం అధికారులు, ఎస్ఐ శోభన్‌కుమార్ ఉన్నారు.

ముసుగు వ్యక్తుల హల్‌చల్

- ఒకరిపై చాకుతో దాడి
- మొగలికుదురులో కలకలం



భాస్కరరావు చేతిపై గాయం

మామిడికుదురు: మొగలికుదురు గ్రామంలో శనివారం రాత్రి 12 గంటల సమయంలో మంకీ క్యాప్‌లు పెట్టుకుని వచ్చిన ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు హల్‌చల్ చేశారు. జాన భాస్కరరావు ఇంటి ప్రహరీ దూకి లోపలకు వచ్చిన ఒక వ్యక్తి అతనిపై చాకుతో దాడి చేసి పరారయ్యాడు. స్థానికంగా ఈ సంఘటన కలకలం రేపింది. భాస్కరరావుతో పాటు ఇంట్లోని వ్యక్తులు శనివారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో ప్రహరీ వద్ద శబ్దం రావడంతో ఆయన బయటకు వచ్చాడు. ఆ సమయంలో ఇద్దరు మంకీ క్యాప్‌లు పెట్టుకుని గేటు వద్ద నిల్చుని ఉన్నారు. ఎవరు మీరు అంటూ అతను ప్రశ్నించాడు. వారు హిందీలో మాట్లాడగా భాస్కరరావు కూడా వారికి హిందీలో సమాధానం చెప్పాడు. ఈ లోగా ఇంటి ప్రహరీ లోపల నక్కి ఉన్న గుర్తు తెలియని మరో ముసుగు వ్యక్తి భాస్కరరావును వెనుక నుంచి నోరు నొక్కి పట్టుకున్నాడు. అతడిని భాస్కరరావు ప్రతిఘటించగా చాకుతో చేతి, పొట్ట, మెడ భాగంలో దాడి చేసి ముగ్గురూ అక్కడి నుంచి పరారయ్యాడు. దీనిపై బాధితుడు భాస్కరరావు ఆదివారం నగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు ఫిర్యాదు అందిందని, దీనిపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై షేక్ జానీబాషా ఆదివారం తెలిపారు.

భజే నారసింహాయ..

- గరుడ, పుష్పక వాహనాలపై స్వామికి గ్రామోత్సవాలు
- అంతర్వేదిలో ఉత్సవ శోభ



గరుడ పుష్పక వాహనంపై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, సభ్యులు

సఖినేటిపల్లి: నమో నారసింహాయ అంటూ ఆ స్వామిని కొలుస్తూ భక్తులు తన్మయత్వం చెందారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి దివ్య తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఉత్సవాలను పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. సాయంత్రం గరుడ పుష్పక, రాత్రి పుష్పక వాహనంపై స్వామివారికి గ్రామోత్సవాలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామ గోపాలరాజా బహద్దూర్, ఉత్సవ సేవా కమిటీ సభ్యులు, అర్చకులు పర్యవేక్షించారు. ఆలయంలో స్వామివారికి వ్యాపారవేత్త జంపన సత్యనారాయణ రాజు, రొటేరియన్ కేవీ రామకృష్ణంరాజు, వసుధ ఫౌండేషన్ ప్రతినిధి జంపన బుజ్జిరాజు ప్రత్యేక పూజలు చేశారు.

కాంతులు.. ఆధ్యాత్మిక పరవళ్లు

లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల ఫ్లెక్సీలు ఆకట్టుకుంటున్నాయి. వీటితో పాటు పశ్చిమ రాజ గోపురం, ప్రధాన, ఉపాలయాల గోపురాలు విద్యుత్ కాంతులతో శోభిల్లుతున్నాయి. పశ్చిమ రాజగోపురం నుంచి స్వామివారి దర్శనానికి వెళ్లే మార్గంలో షామియానాలతో ఏర్పాటు చేసిన కళాకృతులు అలరిస్తున్నాయి. ఆలయం లోపల క్యూలైన్లపై వేసిన షామియానాలు అందమైన డిజైన్‌లతో ఏర్పాటు చేశారు.

అంతర్వేదిలో నేడు..

ఉత్సవాల్లో భాగంగా సోమవారం మూడో రోజు ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 నుంచి 7 గంటల వరకూ శ్రీస్వామివారి తిరువారాధన, బాలభోగం, ఆర్జిత అభిషేకం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు ఉంటాయి. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ శ్రీసుదర్శన హోమం, సాయంత్రం 4 గంటలకు హంస వాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది. 6.30 గంటలకు ధూపసేవ అనంతరం ధ్వజారోహణ, రాత్రి 8 గంటలకు శేష వాహనంపై స్వామివారి గ్రామోత్సవాన్ని అర్చకులు నిర్వహిస్తారు.



విద్యుద్దీపాలంకరణలో పశ్చిమ రాజగోపురం

కాంట్రాక్టు అధ్యాపకుల కమిటీ నియామకం



నూతనంగా ఎన్నికైన కాంట్రాక్టు అధ్యాపకుల కార్యవర్గ సభ్యులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపకుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన జిల్లాల కమిటీలను ఎన్నుకున్నట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ఆర్ శర్మ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా వి.లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శిగా ఎన్‌వీవీ సత్యనారాయణ, కోశాధికారిగా పి.శ్యామలరావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ ఆర్.కుమార్‌రాజా, జనరల్ సెక్రటరీగా జీవీవీ సత్యనారాయణ, కోశాధికారిగా కె.గోవింద్, కాకినాడ జిల్లా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా డి.మోహన్, అధ్యక్షుడిగా పి.రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డి.ప్రవీణ్‌కుమార్, జనరల్ సెక్రటరీగా వి.అచ్యుతబాబు, ఇతర సంఘ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో ఆయా జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీపాద శ్రీవల్లభ స్వామి ఆవిర్భావ ఉత్సవాలు



శ్రీపాద శ్రీవల్లభ స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు



స్వామివారికి మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: స్థానిక శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో వేంచేసియున్న స్వామివారి ఆవిర్భావ ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఐదో రోజు స్వామికి 703 కలశాలతో జల మహా కుంభాభిషేకం నిర్వహించారు. స్వామివారికి పల్లకి గ్రామోత్సవం, సర్వతోభద్ర మండల ఆరాధన, దేవతా హోమం, క్షేత్ర పాలక మండపం, అప్పపాలికా ఆరాధన, సంపూరిత మహా మృత్యుంజయ పాసుపత అభిషేకం, యాగశాల మండపారాధన, చండీ పారాయణం, సూర్య నమస్కారాలు, వేద పారాయణ, గోపూజ, మహా పూర్ణాహుతి, వేద పండిత సత్కారం తదితర కార్యక్రమాలు జరిగాయి. వీటిని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దనరావు పర్యవేక్షించారు. ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించామని, సుమారు లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ ఈఓ సౌజన్య తెలిపారు.

అన్న కోసం ఆస్తి దానం

- జ్ఞాపకార్థం ఆలయానికి రిజిస్ట్రేషన్
- ఉదారత చాటుకున్న తమ్ముడు



దాత సాయిరామ్ దంపతులతో గ్రామ పెద్దలు



బాలగణపతి ఆలయానికి రాసిచ్చిన భవనం

సఖినేటిపల్లి: తనకు శాశ్వతంగా దూరమైన అన్నయ్యపై అభిమానాన్ని చాటుకున్నాడా తమ్ముడు.. అతని జ్ఞాపకార్థం ఉమ్మడిగా నిర్మించుకున్న రూ.25 లక్షల విలువైన స్థిరాస్తిని ఆలయానికి అందజేశాడు. సఖినేటిపల్లి మండలం వీవీమెరకలోని గాంధీనగర్‌లో ఈ ఘటన జరిగింది. ఆదివారం ఆ గ్రామానికి చెందిన చింతా కోటమ్మ, సూర్యప్రకాశరావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చింతా సుధాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. వీవీమెరక గ్రామానికి చెందిన ములికి వీరభద్రరావు, సాయిరామ్‌లు అన్నదమ్ములు. వీరభద్రరావుకు మాటలు రావు. ఇద్దరూ కలిసి ఆ గ్రామంలో రూ.25 లక్షలతో భవనాన్ని నిర్మించుకున్నారు. తర్వాత అకస్మాత్తుగా అన్న వీరభద్రరావు చనిపోయారు. ఇటీవల అతని ప్రథమ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా అన్న జ్ఞాపకార్థం సాయిరామ్ సదరు భవనాన్ని వీవీమెరక గాంధీనగర్‌లో కొలువైన బాలగణపతి ఆలయానికి ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేయించి, హక్కులన్నీ ఆలయ కమిటీకి అప్పగించారు. ఈ విషయాన్ని ఆలయ కమిటీ చైర్మన్ కందనాల ముత్యాలు, గ్రామ పెద్దలకు ఆయన వివరించారు. భవనం బాగోగులు, నిర్వహణ కమిటీ చూస్తుందని, పర్యవేక్షణ తమ కుటుంబం, చింతా సుధాకర్‌రావు కలిపి చూస్తారని సాయిరామ్ తెలిపారు. అన్నపై ఉన్న ప్రేమతో రూ.లక్షల విలువైన స్థిరాస్తిని ఆలయానికి ఇవ్వడం పట్ల సాయిరామ్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఎడ్ల బండి... సై సై అంటూ కదిలిందండి

- మాచవరంలో రాష్ట్ర స్థాయి పోటీలు
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుచే ప్రారంభం
- విజేతలకు బహుమతుల అందజేత



పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న ఎడ్ల బండ్లు



విజేతకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: ఎడ్ల బండి సై సై అంటూ సాగింది.. పోటీకి కాలు దువ్వింది.. దీనికి రాయవరం మండలం మాచవరం వేదికైంది. ఇక్కడ ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల బండ్ల పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. తొలుత ఈ పోటీలను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభించారు. ఇందులో గుంటూరు, కృష్ణా, ఉభయ గోదావరి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి 37 జతల ఎడ్ల బండ్లు పాల్గొన్నాయి. మాచవరం రైతు సంఘం ఆధ్వర్యంలో ఉదయం సీనియర్, మధ్యాహ్నం జూనియర్ విభాగాల్లో పోటీలు జరిగాయి. రామచంద్రపురం, మండపేట, అనపర్తి నియోజకవర్గాల నుంచే కాకుండా జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు.

పశు సంపదను కాపాడుకుందాం..

అనంతరం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ అంతరించిపోతున్న పశు సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎడ్ల బండ్ల పోటీలు సంప్రదాయంగా జరుగుతాయని, దీనిని గ్రామీణ క్రీడగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి ఇతోధికంగా కృషి చేస్తుందన్నారు. జిల్లాలో మండపేట పశు పోషణకు ప్రసిద్ధి గాంచిందన్నారు. ఎడ్ల బండ్ల పోటీల నిర్వాహకులు వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, రైతు సంఘం నేతలు మల్లిడి రామారెడ్డి, కొవ్వూరి వెంకటరెడ్డి (డాబారెడ్డి), కోండ్రపు దుర్గ, గంటి ప్రవీణ్‌కుమార్, కోండ్రపు జెమిని తదితరులను ఆయన అభినందించారు.

పోటీల్లో విజేతలు వీరే..

సీనియర్ విభాగ పోటీలలో ఐదు ఎడ్ల బండ్లు పాల్గొన్నాయి. ఇందులో కోరా వీరవెంకట సత్యవేణి(గుమ్మిలేరు), కోరా తేజచౌదరి (గుమ్మిలేరు), ముత్యాల శ్రీధర్ (చెల్లూరు), వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. జూనియర్ విభాగంలో 31 ఎడ్ల బండ్లు పోటీల్లో పాల్గొనగా మన్యం సత్యనారాయణ (ఆర్‌బీ కొత్తూరు), వల్లూరి సత్యేంద్రకుమార్ (సామర్లకోట), వల్లూరి సత్యేంద్రకుమార్ (సామర్లకోట), గాడాపు ప్రేరణ (పెద్దాపురం), మొగలి ఏసుబాబు (వెల్దుర్తి), నాగార్జున మెమోరియల్ ఈశాంత్‌కుమార్ (చావలపాడు)లు వరుస స్థానాల్లో నిలిచారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేతుల మీదుగా విజేతలకు మెమెంటోలు అందజేశారు. సర్పంచ్ కత్తుల సీతా మహాలక్ష్మి అప్పారావు, ఉప సర్పంచ్ పడాల వసంత్ కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ పలివెల శోభనసతీష్, నాయకుడు పడాల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.